## సామెత కథలు

# బాదరాయణ సంబంధం

- ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

ఒక ఊరిలో అన్నెం పున్నెం ఎరుగని అమాయక బ్రాహ్మణ దంపతులు కాపురం ఉండేవారు. ఒకనాడు మగడు అరుగుపై కూర్చుండి, జందెం వడకుకొనుచుండగా పొరుగు ఊరినుండి మరియొక బ్రాహ్మణుడు ఆదరా బాదరాగా బండి తోలుకొని వచ్చి, అచ్చటనే ఉస్సురంటూ దిగాడు. ఎద్దులను విప్పి, ఇంటికి ఎదురుగా ఉన్న రేగు చెట్టుకు కట్టాడు.

ఆ సమయములో ఇంటియావిడ వంటింటి పనులు చక్కబెట్టుకొనుచున్నది. క్రొత్తగా వచ్చిన బాపడు ఎవరి ఆహ్వానమూ లేకపోయినా చరచరా లోన ప్రవేశించి, పెరటిలో నూతివద్దకు పోయి, కాళ్ళు చేతులు మొగము కడుక్కొని, దండెముమీద వ్రేలాడదీసిన కొల్లాయిగుడ్డతో కాళ్ళు తుడుచుకొన్నాడు. పిమ్మట అరుగుమీద కూర్చుండి యజమానితో కూడ ప్రత్తి పింజలుగా తీయడము మొదలుపెట్టాడు. ఇంతలో "వంటైంది, భోజనానికి లేవండి" అని ఇల్లాలు కేక వేసింది.

అతిథి కూడా లేచి, స్నానసంధ్యాదికం ముగించుకొని, వడ్డించిన విస్తళ్ళలో జొరబడి గృహస్థుతో బాటుగా సుష్టుగా భోజనము చేసాడు. పిమ్మట అతిథి పండుకొని విశ్రాంతి తీసికొన్నాడు. భార్య నెమ్మదిగా భర్తను సమీపించి, "ఏమండీ! ఈతడు మీకు ఏమౌతాడు?" అని ప్రశ్నించింది. భర్త అచ్చెరువంది "చస్తే దయ్యం, బ్రతికి ఉంటే భూతము అవుతాడు. అంతకంటే ఎక్కువ భాంధవ్యం ఉంటే వాడినే అడిగి తెలుసుకోవాలి" అన్నాడు. కొంత సేపటికి నిద్రనుండి మేల్కొన్న అతిథిని "అయ్యా! మీరెవ్వరు? మీకు మాకు గల చుట్టరికము ఎలాంటిదో సెలవిస్తారా?" అని అడిగెను.

అతిథి నవ్వుతూ "మీరు ఎప్పుడైనా విన్నారో లేదో రేగు చెట్టును బదరీ వృక్షమని అంటారు. మీ ఇంటి ముందు రేగు చెట్టు ఉన్నది. నా బండి చక్రములు రేగుకఱ్ఱతో చేసినవి. ఈ విధముగా మన ఇద్దఱకు బాదరాయణ సంబంధము ఉన్నది. ఇది విడిస్తే మీరు మీరే, మేము మేమే" అన్నాడు. "అయ్యా! కోపము చేయకుండా ఉంటే దగ్గర సంబంధాలని అనుకున్నవి కూడా ఇంతకంటే అధ్వాన్నంగానే ఉంటాయి. సముద్రపుటుప్పుకు అడవి ఉసిరికాయకు గల సంబంధము ఎట్లాంటిది? వేర్వేరు ప్రదేశాలనుండి ప్రవాహములో కొట్టుకొని వచ్చిన కట్టె పుల్లలకు ఏలాంటి సంబంధము ఉందో విచారిస్తే, భార్యాభర్తల సంబంధం కూడా అట్లాంటిదే అని తోస్తుంది. మీ ఇద్దఱకు మంగళసూత్ర-సంబంధం, మన ఇద్దఱకు రేగుకఱ్ఱ సంబంధం. ఇంతే కదా తేడా" అంటూ వెళ్ళిపోయాడు అతిథి.

(తెనుగు జాతీయముల కథలు పుస్తకము ఆధారముతో కూర్చబడినది. రచయిత శ్రీ ముసునూరి లక్ష్మీ గణపతి శాస్త్రిగారికి కృతజ్ఞతలతో - సంపాదకులు)